# సాక్షి
## జనగామ

గురువారం | 2 | నవంబర్ | 2023






**యాజమాన్య పద్ధతులు పాటించాలి**

మిరప పంటపై నల్ల తామర పురుగును తొలిదశలోనే గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ రాజన్న సూచించారు.

- 10లో▸



**బీఆర్ఎస్, ఎంఐఎం ఒక్కటే..**

బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలు ఆస్తుల సంరక్షణకు లోపాయికారి ఒప్పందం చేసుకున్నాయని టీపీసీసీ అధికార ప్రతినిధి రియాజ్ ఆరోపించారు.

- 10లో▸

గరిష్టం/కనిష్టం
$33^0/22^0$

**వాతావరణం**

జిల్లాలో ఉదయం చల్లని వాతావరణం ఉంటుంది. ఆకాశం అక్కడక్కడా మేఘావృతమై మధ్యాహ్నం సమయంలో ఉష్ణోగ్రతలు కాస్త తగ్గుతాయి. రాత్రి పూట చలి పెరుగుతుంది.

## న్యూస్‌రీల్

### కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర



పాలకుర్తి/నర్మెట: ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం అవుతున్నాయి.. నాణ్యతా ప్రమాణాలు పాటించి ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర పొందాలని జనగామ డీసీఓ రాజేందర్‌రెడ్డి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ శంకర్ రైతులకు సూచించారు. బుధవారం ఎల్లరాయని తొర్రూరు, ఈరవెన్ను, కోతులబాధ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం వరికి మద్దతు ధర రూ.2,203, సాధారణ రకానికి రూ.2183 చెల్లిస్తుందని, తేమ 17 శాతం లోబడి ఉండేలా పంటను ఆరబెట్టుకుని పట్టా పాస్‌బుక్‌లు తీసుకుని రావాలని సూచించారు. కార్యక్రమంలో సీఈఓ రణధీర్, ఏఈఓలు సంధ్య, శ్రావణి, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. నర్మెట మండల కేంద్రం, కన్నెబోయినగూడెం, గండిరామారంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను జిల్లా సహకార అసిస్టెంట్ రిజిస్ట్రాష్టార్ ముజామిల్ ప్రారంభించి మాట్లాడారు. సీఈఓ కొన్నె వెంకటయ్య, ఏఈఓలు సుంకరి జగదీష్, కమటం భవాని, కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

### మేరు సంఘం జిల్లా కమిటీ



జనగామ రూరల్: మేరు కుల సంఘం జిల్లా కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాపర్తి రాజు, ప్రధాన కార్యదర్శిగా సోమ వెంకన్న, కోశాధికారిగా దికోడ విష్ణు ఎన్నికయ్యారు. సమావేశానికి జిల్లాలోని అన్ని మండలాల నుంచి అధ్యక్ష, కార్యదర్శులతోపాటు ఉమ్మడి వరంగల్ జిల్లా కన్వీనర్ తాళ్లపల్లి సంపత్‌కుమార్, హరిప్రసాధ్, గూడూరు బాలాజీ, కర్నె రవీందర్, గూడూరు నరేందర్, రామగిరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### భద్రకాళి ఆలయ ఆదాయం రూ.60,86,805



హన్మకొండ కల్చరల్ : భద్రకాళి దేవాలయంలో బుధవారం హుండీ లెక్కింపు నిర్వహించగా రూ. 60,86,805 ఆదాయం లభించిందని ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ కె.శేషుభారతి తెలిపారు. నగదును యూనియన్ బ్యాంకులో జమ చేసినట్లు ఆమె పేర్కొన్నారు. ఇందులో విదేశీ కరెన్సీ కూడా ఉందని తెలిపారు. పర్యవేక్షకులుగా దేవాదాయశాఖ పరిశీలకులు జి.సంజీవరెడ్డి వ్యవహరించారు. సూపరింటెండెంట్ అద్దంకి విజయ్‌కుమార్, సిబ్బంది, మహబూబాబాద్‌కు చెందిన శ్రీలక్ష్మీవేంకటేశ్వర సేవా సమితి సభ్యులు 60 మంది పాల్గొన్నారు.

### రోడ్లను పరిశీలించిన నిట్ అధ్యాపకులు

కాజీపేట అర్బన్ : నిట్ సివిల్ ఇంజనీరింగ్ అధ్యాపకులు బుధవారం గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్లను పరిశీలించారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లోని పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి రోజ్‌గార్ యోజనలో నిర్మించిన జియో టెక్స్‌టైల్, జియో సింథటిక్ రోడ్లను సందర్శించారు. నిట్ వరంగల్‌కు చెందిన స్టేట్ టెక్నికల్ ఏజెన్సీ, ప్రిన్సిపల్ టెక్నికల్ ఏజెన్సీ సౌజన్యంతో రోడ్ల పనితీరును పరిశీలించి నివేదికను అందజేయనున్నట్లు ఈ సందర్భంగా ప్రొఫెసర్లు తెలిపారు.

### నల్లనేలలో నాలుగోసారి..

- 2009లో భూపాలపల్లి నియోజకవర్గం ఏర్పాటు
- రెండుసార్లు కాంగ్రెస్, ఒకసారి బీఆర్ఎస్ విజయం

### ప్రజల ఆకాంక్ష నెరవేర్చాలి

సాక్షి 'పీపుల్స్ ఎజెండా'

- ఉపాధికోసం పరిశ్రమలు ఏర్పాటు చేయాలి
- 'సాక్షి' పీపుల్స్ ఎజెండాలో కాళోజీ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

### నేతల అడ్డా.. పర్వతగిరి గడ్డ

- కేంద్ర, రాష్ట్ర రాజకీయాల్లో మండల వాసుల కీలకపాత్ర
- ఎంపీ, మంత్రి, ఇతర పదవులు

- వివరాలు 10లో▸

# నామినేషన్లకు సిద్ధం

**రేపే ఎన్నికల నోటిఫికేషన్ విడుదల**

- అదే రోజు నుంచి నామినేషన్ల స్వీకరణ
- మూడు నియోజకవర్గాల్లో ఏర్పాట్లు పూర్తి



జనగామ ఆర్డీఓ కార్యాలయం



నామినేషన్ల స్వీకరణ కేంద్రం

జనగామ: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని రెవెన్యూ డివిజన్, తహసీల్ కార్యాలయాల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు. సాధారణ శాసనసభ ఎన్నికలకు ఈనెల 3న నోటిఫికేషన్ వెలువడనుంది.. అదే రోజు నుంచి 10వ తేదీ వరకు చేపట్టే నామినేషన్ల స్వీకరణ ప్రక్రియకు సంబంధించి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శివలింగయ్య నేతృత్వంలో కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నారు. ఆదివారం సెలవు మినహా మిగతా రోజుల్లో అభ్యర్థుల నుంచి ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. అభ్యర్థి నామినేషన్ అంగీకరిస్తున్నట్టుగా నియోజకవర్గ ఓటర్ల జాబితాలో నమోదైన పదిమంది ఓటర్లు సంతకాలు చేయాల్సి ఉంటుంది. జనరల్ అభ్యర్థులు నామినేషన్ ఫీజు రూ.10వేలు, ఎస్సీ, ఎస్టీ వర్గాల వారు రూ.5వేలు చెల్లించాల్సి ఉంటుంది. ఫారం 26 ద్వారా అభ్యర్థికి సంబంధించిన పూర్తి బయోడేటా జత పరిచి అఫిడవిట్‌తోపాటు నగదు చలాన్ లేదా నేరుగా ఆర్‌ఓకు అందించాలి. ఇందులో సీ–1, సీ–2 ఫాంలు తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలి. సీ–1లో అభ్యర్థికి సంబంధించి గతంలో ఏవైనా క్రిమినల్ కేసులు, పెండింగ్‌తో పాటు కోర్టు ద్వారా శిక్షలు పడ్డాయా అనే విషయాలను సమగ్రంగా పేర్కొనాలి. సీ–2లో పెండింగ్ కేసులతో పాటు నేర వివరాలు, శిక్షలకు సంబంధించి ఆయా పార్టీల అధిష్టానికి సమాచారం అందించాలి. ఈ రెండు ఫాంలలో పూర్తి సమాచారం ఉండేలా చూసుకోవాలి. ఇందుకు సంబంధించి సీ–3 ఫాం ద్వారా అభ్యర్థులకు ఆర్‌ఓ ముందుగానే నోటీసు అందిస్తారు. నామినేషన్ దాఖలు చేసే సమయంలో ఎలక్షన్ కమిషన్ పేర్కొన్న నియమ నిబంధనలు పూర్తిగా పాటించాలి. అభ్యర్థులు నామినేషన్ వేసే సమయంలో తెలుపు, క్రీము రంగు కలిగి, ముఖం క్లియర్‌గా కనిపించే ఇటీవల దిగిన స్టాంపు సైజ్ ఫొటోను నామినేషన్ పత్రంతో ఎన్నికల అధికారులకు అందజేయాలి.

**నామినేషన్లు స్వీకరించేది ఇక్కడే..**

అభ్యర్థుల నుంచి నామినేషన్లను జనగామ నియోకవర్గానికి సంబంధించి హన్మకొండరోడ్డులోని రెవెన్యూ డివిజన్ కార్యాలయం(ఆర్డీఓ), స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి నియోజకవర్గాలకు సంబంధించి ఆయా తహసీల్దార్ కార్యాలయాల్లో నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు చేశారు. జనగామ ఆర్‌ఓగా ఆర్డీఓ మురళీ కృష్ణ, స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీఓ వి.రామ్మూర్తి, పాలకుర్తి ఆర్‌ఓగా రెవెన్యూ విభాగం అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్‌ను నియమించారు. ఆర్‌ఓలకు సహాయకులుగా ఏఆర్‌ఓ, సెక్షన్ క్లర్క్ ఉంటారు. 13వ తేదీన స్క్రూటినీ, 15వ తేదీన అభ్యర్థుల కు విత్‌డ్రా చేసుకునే అవకాశం కల్పించారు. అదే రోజు బరిలో నిలిచిన తుది అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారు. నామినేషన్ ప్రక్రియను వీడియో చిత్రీకరిస్తారు. నామినేషన్లు వేసే అభ్యర్థులకు ఆర్‌ఓ కార్యాలయాల్లో పత్రాలను ఉచితంగానే అందజేస్తారు.

**ఆర్‌ఓ కేంద్రాల్లో హెల్ప్‌డెస్క్‌లు..**

నియోజకవర్గ ఆర్‌ఓ కేంద్రాల్లో హెల్ప్‌డెస్క్‌లు అందుబాటులో ఉంటాయి. ఎన్నికల సంఘం నియమ నిబంధనల మేరకు నామినేషన్ పత్రాలు పూర్తి చేసే సమయంలో అభ్యర్థులకు సలహాలు, సూచనలు అందించేందుకు హెల్ప్‌డెస్క్‌లోని బాధ్యులు సహకారం అందిస్తారు.

**పోలీసు బందోబస్తు**

నామినేషన్ల స్వీకరణ సమయంలో ఆర్‌ఓ కార్యాలయాల వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. చుట్టుపక్కల ప్రాంతాల వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుంది. ఆర్‌ఓ కార్యాలయం వైపు ఒకేసారి వందల సంఖ్యలో పార్టీ అభిమానులు, కార్యకర్తలు, నాయకులు గుంపుగా రాకుండా అన్ని రాజకీయ పార్టీలకు ముందస్తు నిబంధనలు వివరిస్తున్నారు.

**నామినేషన్ల స్వీకరణ కేంద్రాలు**

| | |
|---|---|
| జనగామ : | ఆర్డీఓ కార్యాలయం |
| స్టేషన్‌ఘన్‌పూర్ : | తహసీల్ కార్యాలయం |
| పాలకుర్తి : | తహసీల్ కార్యాలయం |

3 నుంచి 10వ తేదీవరకు నామినేషన్లు
ఉదయం 11 నుంచి 3 వరకు స్వీకరణ
13వ తేదీన స్క్రూటిని
15న విత్ డ్రా, అదేరోజు తుది జాబితా ప్రకటన

జంగ్ తెలంగాణ

## నేడు కాళేశ్వరానికి రాహుల్‌గాంధీ

**అంబట్‌పల్లిలో మహిళా సాధికారత సదస్సుకు హాజరు**

- కుంగిన మేడిగడ్డ ప్రాంతాన్ని పరిశీలించే అవకాశం
- మావోయిస్టు ప్రభావిత ప్రాంతంలో మరో సభ
- గతనెల 18న రామాంజపూర్‌లో సభ.. 15 రోజుల వ్యవధిలో రెండోసారి
- రాహుల్ సభ కోసం భారీగా ఏర్పాట్లు



సాక్షిప్రతినిధి, వరంగల్: ఏఐసీసీ అగ్రనేత, అఖిల భారత కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీ మరోమారు ఉమ్మడి వరంగల్ జిల్లాకు వస్తున్నారు. గురువారం ఆయన జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం, అంబట్‌పల్లి ప్రాంతాల్లో పర్యటించనున్నారు. గతనెల 18, 19 తేదీల్లో ములుగు, జేఎస్ భూపాలపల్లి జిల్లాల్లో బస్సుయాత్ర, సభలు నిర్వహించిన ఆయన.. సుమారు 15 రోజుల వ్యవధిలో రెండోసారి పర్యటించనున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ నేతలు భారీ సమీకరణ చేశారు. అంబట్‌పల్లి సమీపంలో సుమారు ఐదు వేల మందితో మహిళాసాధికారిత సభను నిర్వహించుకునేందుకు అనుమతి లభించినా.. బుధవారం రాత్రి 9 గంటలకు హెలిపాడ్ ఏర్పాటు, హెలికాప్టర్ గ్రౌండ్స్‌కు క్లియరెన్స్ వచ్చాయి. ఎన్నికల సందర్భంగా ఆదివాసీ ప్రాంతాలను ఎంచుకున్న రాహుల్‌గాంధీ.. ఉమ్మడి జిల్లాలో తొలి పర్యటన, సభలు ములుగు, జేఎస్ భూపాలపల్లి జిల్లాల్లోనే మొదలెట్టారు. గతనెల 18న హైదరాబాద్ నుంచి నేరుగా హెలికాప్టర్ ద్వారా ములుగు జిల్లా రామప్ప ఆలయానికి చేరుకున్న రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీలు.. అక్కడి నుంచే బస్సుయాత్ర ప్రారంభించారు. అనంతరం రామాంజపూర్ వద్ద ఏర్పాటు చేసిన బహిరంగసభలో ప్రసంగించిన తర్వాత చెల్పూర్ జెన్‌కో గెస్టుహౌస్‌లో రాత్రి బస చేశారు. 19న ఉదయం బైక్‌ర్యాలీగా బస్సుయాత్ర సాగగా, కాటారం వద్ద జరిగిన సభల్లో ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు.

**ఉదయమే కార్యక్రమం..**

హెలికాప్టర్ ద్వారా గురువారం ఉదయమే జయశంకర్‌భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం అంబట్‌పల్లికి ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ చేరుకోనున్నారు. ఈ మేరకు పోలీస్ ఉన్నతాధికారులు సైతం మావోయిస్టు ప్రభావిత ప్రాంతంలో రాహుల్ పర్యటన నేపథ్యంలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. బుధవారం సాయంత్రంనుంచే పోలీస్ బలగాలను మోహరించారు. గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సభకు అనుమతి ఉండగా.. 8.30 గంటల నుంచి 11 గంటల వరకు మహిళలతో సదస్సు ఉంటుందని ఆ పార్టీ అధికార ప్రతినిధి శశిభూషన్ కాచే తెలిపారు. కాగా, అంబట్‌పల్లి సభలో పాల్గొననున్న రాహుల్‌గాంధీ.. మేడిగడ్డ ప్రాజెక్టులో కుంగిపోయిన ప్రాంతాన్ని కూడా సందర్శించే అవకాశం ఉందని తెలుస్తోంది. కాగా, రాహుల్ పర్యటన ఏర్పాట్లను మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు బుధవారం సాయంత్రం పరిశీలించారు.

## రెవెన్యూ సిబ్బంది అందుబాటులో ఉండాలి

- జిల్లా ఎన్నికల అధికారి శివలింగయ్య

జనగామ: శాసనసభ ఎన్నికల విధులు నిర్వహిస్తున్న కలెక్టరేట్ రెవెన్యూ సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సీహెచ్ శివలింగయ్య అన్నారు. బుధవారం కలెక్టర్ కార్యాలయ ఎన్నికల విభాగం సిబ్బందితో ఏర్పాటు చేసిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల నిర్వహణ సజావుగా సాగేలా విభాగాల వారీగా సిబ్బందిని నియమించామని, ఎవరికి కేటాయించిన పనులను వారు చూసుకోవాలని చెప్పారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు సిబ్బందికి సాధారణ సెలవులు ఉండవని స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కంట్రోల్ రూం, సర్వేలైన్స్ సిస్టం, మీడియా సెంటర్, ఎన్నికల విభాగం హెల్ప్‌లైన్ సెంటర్ 24 గంటల పాటు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. కాగా వ్యవసాయ మార్కెట్ గోదాంలో భద్రపరిచిన ఈవీఎంల స్టోర్‌ను పరిశీలించారు. అదనపు కలెక్టర్ సుహాసిని, రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

## ఆర్‌ఓలు సిద్ధంగా ఉండాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శివలింగయ్య



టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్, పాల్గొన్న జిల్లా ఉన్నతాధికారులు

జనగామ : అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఈనెల 3 నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కానున్న నేపథ్యంలో జిల్లాలోని మూడు నియోజకవర్గాల పరిధి రిటర్నింగ్ అధికారులు తమ కార్యాలయాల్లో అందుబాటులో ఉండాలి. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవడంతోపాటు చెక్ లిస్టు ప్రకారం భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సీహెచ్.శివలింగయ్య సూచించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి రిటర్నింగ్ అధికారులతో ఎన్నికల నిర్వహణ, నామినేషన్ల స్వీకరణ, తదితర అంశాలపై టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఆర్‌ఓ కార్యాలయానికి 100 మీటర్ల దూరంలో నిబంధనల ప్రకారం చర్యలు చేపట్టాలని చెప్పారు. నామినేషన్ వేసే అభ్యర్థులకు ఎన్నికల సంఘం సూచనలను వివరించాలని పేర్కొన్నారు. పోస్టల్ బ్యాలెట్ పంపిణీ, స్వీకరణ తదితర అంశాలపై ప్రత్యేకంగా దృష్టి పెంట్టాలని తెలిపారు. ఆర్‌ఓ కార్యాలయం నుంచి జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయానికి రోజువారి నివేదికలు పంపించేందుకు ప్రత్యేక అధికారిని నియమించాలన్నారు. టెలికాన్ఫరెన్స్‌లో ఎన్నికల నోడల్ అధికారులు రంగాచారి, హుస్సేన్, చంద్రశేఖర్, ఇస్మాయిల్, ఎలక్షన్ సూపరింటెండెంట్ శ్రీనివాస్, కలెక్టరేట్ ఏఓ రవీందర్ పాల్గొన్నారు.

## గెలిపిస్తే.. రుణం తీర్చుకుంటా..

- బీఆర్ఎస్ జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి



జనగామ 3వ వార్డులో ప్రచారం చేస్తున్న 'పల్లా'

జనగామ: అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్లు వేసి ఆశీర్వదిస్తే అభివృద్ధి, సంక్షేమంతో రుణం తీర్చుకుంటానని బీఆర్ఎస్ జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని 2, 3, 4, 13, 16, 19, 20 వార్డుల్లో ఇంటింటి ప్రచారం చేపట్టిన ఆయనకు.. పార్టీ శ్రేణులు, కాలనీవాసులు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కేసీఆర్ ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. భారీ మెజార్టీతో గెలిపిస్తే అందుబాటులో ఉండి నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తామని చెప్పారు. సంక్షేమ పథకాలను ఇంటింటికీ చేర్చిన సీఎంను మూడవ సారి దీవించేందుకు ప్రజలు ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు బండ పద్మయాదగిరిరెడ్డి, జూకంటి లక్ష్మిశ్రీశైలం, పగిడిపాటి సుధాసుగుణాకర్‌రాజు, కర్రె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. పల్లా విజయాన్ని కాంక్షిస్తూ నర్మెట మండలం మచ్చుపాడ్‌కు చెందిన దివ్యాంగుడు తన పింఛన్ డబ్బులు రూ.4వేలు, పట్టణంలోని 4వ వార్డుకు చెందిన జూకంటి యాదగిరి రూ.2వేలు, వనమాల రమేష్ రూ.5వేలు ఎన్నికల ఖర్చు కోసం అందించినట్లు పార్టీ నాయకులు తెలిపారు.

## గిరిజన డిక్లరేషన్ అమలు చేయాలి



రాజేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

జనగామ రూరల్: జిల్లాలో ఉన్న గిరిజన తండాలను అభివృద్ధి చేసి గిరిజన డిక్లరేషన్ ఏర్పాటు చేయాలని సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు ధరావత్ శంకర్‌నాయక్ అన్నారు. ఈ మేరకు బుధవారం బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డిని కలిసిన ఆయన పది డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలో మైదాన ప్రాంత ఐటీడీఏ, గిరిజన స్టడీ సర్కిల్, తండాల డెవలప్‌మెంట్ బోర్డు, యువకులకు స్కిల్ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో బానోత్ మహేందర్, భూక్య రాజు, అనిల్ చౌహాన్, రమేష్, భిక్షపతి, విజయ్, అశోక్, ప్రశాంత్, సుమన్, వినోద్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

### ఓయూ నుంచి ఇద్దరికి డాక్టరేట్



పట్టా అందుకుంటున్న మహేందర్, భాస్కర్

పాలకుర్తి టౌన్/దేవరుప్పుల : పాలకుర్తి మండలం విస్నూరుకు చెందిన అరూరి మహేందర్, దేవరుప్పుల మండలం మాధాపురం రెవెన్యూ పరిధి పడమటితండాకు చెందిన గుగులోతు భాస్కర్ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. ఈ మేరకు హైదరాబాద్‌లో జరిగిన వర్సిటీ స్నాతకోత్సవం సందర్భంగా వీసీ ప్రొఫెసర్ రవీందర్‌యాదవ్, శంతన్ నారాయణ్ చైర్ ఆఫ్ అడోబ్ పట్టాలు ప్రదానం చేశారు. మహేందర్.. 'సౌర వాతావరణం నుంచి రేడియో ఉద్గారాల అధ్యయనం' అనే అంశంపై, 'పర్ఫార్మెన్స్ అనాలసిస్ ఆఫ్ సిగ్నల్ ఇంటిగ్రిటీ ఫర్ కార్బన్ నానో ట్యూబ్ ఆన్ చిప్ వీఎల్ఎస్ఐ ఇంటర్ కనెక్ట్ యూజింగ్ మల్టీ రిసల్యూషన్ టైం డొమైన్ టెక్నిక్' అనే అంశంపై భాస్కర్ పరిశోధన పత్రాలు సమర్పించారు. మారుమూల గిరిజన తండాకు చెందన గుగులోతు భీక్యా కుమారుడు భాస్కర్ యూజీసీ నుంచి మెరిట్టోరియస్ జేఆర్ ఎఫ్ ఫెలోషిప్ సాధించి పరిశోధన పూర్తి చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్, జిస్టార్ ప్రొఫెసర్ పి.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌కు గుణపాఠం తప్పదు

- టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగపురం ఇందిర



కాంగ్రెస్‌లో చేరిన వారితో సింగపురం ఇందిర

స్టేషన్‌ఘన్‌పూర్: రాష్ట్రంలో నిరంకుశ, నియంత పాలన సాగిస్తున్న బీఆర్ఎస్‌కు ప్రజల చేతిలో తగిన గుణపాఠం తప్పదని కాంగ్రెస్ పార్టీ ఘన్‌పూర్ అభ్యర్థి సింగపురం ఇందిర అన్నారు. స్టేషన్ ఘన్‌పూర్, శివునిపల్లికి చెందిన బీఆర్ఎస్, బీజేపీలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు బుధవారం కాంగ్రెస్‌లో చేరగా.. వారికి ఇందిర కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు ప్రత్యామ్నాయంగా కాంగ్రెస్ వైపు చూస్తున్నారని, రానున్న ఎన్నికల్లో దేశంలో, రాష్ట్రంలో తమ పార్టీ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

### నిరంజనాచారికి ఉత్తమ ఇంజనీర్ అవార్డు



అవార్డులతో నిరంజనాచారి, రాజనర్సింహారెడ్డి

దేవరుప్పుల: మండల పరిధి నీర్మాల గ్రామానికి చెందిన ప్రముఖ వాస్తుశాస్త్ర నిపుణులు పానుగంటి నిరంజనాచారికి ఇండియన్ కాంక్రీట్ ఇన్‌స్టిట్యూషన్, అల్ట్రాటెక్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా ఉత్తమ ఇంజనీర్ అవార్డు అందజేశారు. హనుమకొండలో బుధవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఇండియన్ కాంక్రీట్ ఇన్‌స్టిట్యూషన్ వరంగల్ చైర్మన్ బి.లక్ష్మణ్, అల్ట్రాటెక్ లిమిటెడ్ తెలంగాణ ప్రాంతీయ సంచాలకులు అవిజిత్ చేతుల మీదుగా నిరంజనాచారి అవార్డు అందుకున్నారు. అలాగే జనగామకు చెందిన బిల్డర్ జంగా రాజనర్సింహారెడ్డి, ఇంటి యజమాని కొత్త బుచ్చిరెడ్డిలకు అవార్డు అందించి సత్కరించారు. ఈకేఈ బృందం సభ్యులు చక్రవర్తి, పవన్ కృష్ణ, వేణుమాదవ్, హిదాయత్‌అలీ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## సీపీఎస్ రద్దుకు టీఎన్జీవోస్ కృషి



సమావేశంలో మాట్లాడుతున్న రాజేందర్

హన్మకొండ అర్బన్ : సీపీఎస్ రద్దు కోసం టీఎన్జీవోస్ కృషి చేస్తోందని టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ అన్నారు. హనుమకొండ కలెక్టరేట్‌లోని టీఎన్జీవోస్ భవన్‌లో ఆకుల రాజేందర్ అధ్యక్షతన బుధవారం జిల్లా కమిటీ అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ ఆల్ ఇండియా స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఢిల్లీలో శుక్రవారం జరిగే కార్యక్రమానికి టీఎన్జీవోస్ యూనియన్ పక్షాన హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన ఆదాయ పన్ను పరిమితిని పెంచాలని ఈ సభ ద్వారా కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, అసోసియేట్ అధ్యక్షుడు పుల్లూరు వేణుగోపాల్, కోశాధికారి పనికెల రాజేష్, కేంద్ర సంఘం నాయకులు శ్యాంసుందర్, కత్తి రమేష్, రామునాయక్, మోయిస్, లక్ష్మీప్రసాద్, జిల్లా నాయకులు సలీం, శ్రీనివాస్, రాజమౌళి, బింగి సురేష్, శ్రీనివాస్, రాజేష్ కన్నా, రాంప్రసాద్, గౌతమ్, పైడిరాజు, రామాంజనేయులు, అనుప్, రాజీవ్, మిస్బా, ప్రణయ్, పృథ్వీ, శ్యాం తదితరులు పాల్గొన్నారు.

## ఇక్కడే ఉంటా.. అభివృద్ధి చేస్తా

- కాంగ్రెస్ జనగామ అభ్యర్థి 'కొమ్మూరి'



సిద్దెంకిలో మాట్లాడుతున్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

జనగామ రూరల్: బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు విస్మరించింది.. తగిన బుద్ధి చెప్పి స్థానికుడినైన తనను గెలిపించాలి.. జనగామలోనే ఉంటా.. అభివృద్ధి చేస్తా అని కాంగ్రెస్ పార్టీ జనగామ నియోజకవర్గ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. బుధవారం జనగామ మండల పరిధి పెంబర్తి, ఎల్లంల, సిద్దెంకి, పెద్దరాంచర్ల గ్రామాల్లో పార్టీ ప్రకటించిన 'ఆరు గ్యారంటీ' పథకాలను ఇంటింట ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తపాస్‌పల్లి రిజర్వాయర్ తీసుకొచ్చింది తానేనని, ఇప్పుడు ఆ నీరే అందుతున్నదని చెప్పారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను బీఆర్ఎస్ విస్మరించిందని, వర్షాకాలంలో చెక్ డ్యాంలు, రోడ్లు తెగిపోతే ఇప్పటి వరకు మరమ్మతు చేయని పరిస్థితి ఉందని పేర్కొన్నారు. నిరుద్యోగులను మోసం చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని పేర్కొన్నారు. స్థానికేతరుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డిపై భూకబ్జా కేసులున్నాయని, ఆయన ఎమ్మెల్సీగా ఉండి జనగామకు ఎన్ని నిధులు ఇచ్చారని ప్రశ్నించారు. అంతకు ముందు పెంబర్తిలో పలువురు కాంగ్రెస్ చేరారు. నర్సిరెడ్డి, మల్లారెడ్డి, శివరాజ్, సిద్దులు, సిద్దెంకి సర్పంచ్ నిర్మల శ్రీనివాస్‌రెడ్డి, ఎండీ రహీమ్ తదితరులు పాల్గొన్నారు.


## స్థానిక బిడ్డను.. అవకాశం ఇవ్వండి

- బీజేపీ అభ్యర్థి ఆరుట్ల దశమంత్‌రెడ్డి



వడ్లకొండలో ప్రచారం చేస్తున్న దశమంతరెడ్డి

జనగామ రూరల్: పోరాడి సాధించుకున్న జిల్లా అభివృద్ధిని తుంగలో తొక్కారు.. స్థానిక బిడ్డను.. తనకు అవకాశం ఇవ్వాలని బీజేపీ జనగామ అభ్యర్థి ఆరుట్ల దశమంతరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధి వడ్లకొండ, ఎర్రకుంటతండా, గోపిరాజుపల్లి, పెద్దపహాడ్, ఓబుల్‌కేశ్వాపూర్, పసరమడ్ల, పెద్దరాంచర్ల గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేంద్రం నిధులతోనే తెలంగాణలో పథకాలు అమలవుతున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చింది ఏమీ లేదన్నారు. గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు ఏమైయ్యాయని నిలదీశారు. పేదలకు డబుల్ బెడ్రూం, దళితులకు మూడెకరాల భూమి, ఎక్కడ ఇచ్చారని ప్రశ్నించారు. జిల్లా సాధనలో ముందున్న తనకు అవకాశం ఇచ్చి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సిరికొండ విద్యాసాగర్, ఉడుగుల రమేష్, సొడ రమేష్, బి.తిరుపతి, మహిపాల్, కొంతం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఒక నాయకుడు దూరం నుంచే నిన్ను గుర్తు పట్టి దండం పెట్టాడంటే.. ఎన్నికలు ఎంతో దూరం లేవని అర్థం.

- కిన్‌హబ్బార్డ్

## ఈ ముచ్చటెరికనా?

# నేతల అడ్డా.. పర్వతగిరి గడ్డ

- కేంద్ర, రాష్ట్ర రాజకీయాల్లో మండల వాసుల కీలకపాత్ర
- వరించిన ఎంపీ, మంత్రి, ఇతర పదవులు


పర్వతగిరి : పర్వతగిరి.. వరంగల్ జిల్లాలోని ఓ మండలం. చైతన్యం కలిగిన రాజకీయానికి ఈ గడ్డ పెట్టింది పేరు. ఇక్కడి నుంచే తమ రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన పలువురు నాయకులు కేంద్ర, రాష్ట్ర రాజకీయాల్లో కీలక పదవులు చేపడుతున్నారు. మండలంలోని కొంకపాక, ఏనుగల్, పర్వతగిరి గ్రామాలకు చెందిన నాయకులు అనేక సంవత్సరాలుగా మంత్రులు, ఎమ్మెల్యే, ఎంపీలుగా పని చేశారు. కొంకపాక గ్రామానికి చెందిన తక్కళ్లపల్లి పురుషోత్తమరావు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రోడ్ల భవనాల శాఖ మంత్రిగా పని చేశారు. అలాగే, రిమోట్ ఇంటీరియల్ ఏరియా డెవలప్‌మెంట్‌పై హైపవర్ కమిటీ చైర్మన్‌గా పని చేశారు. అలాగే, ఏనుగల్ గ్రామానికి చెందిన బోయినపల్లి వినోద్‌కుమార్ హనుమకొండ, కరీంనగర్ ఎంపీగా పని చేసి, ప్రస్తుతం ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పని చేస్తున్నారు. పర్వతగిరి గ్రామానికి చెందిన మాజీ మంత్రి కడియం శ్రీహరి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పది సంవత్సరాలు భారీ నీటి పారుదల, విద్యాశాఖ, సాంఘిక సంక్షేమశాఖ, మార్కెటింగ్ శాఖ మంత్రిగా, తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా పని చేశారు. ప్రస్తుతం బీఆర్ఎస్ స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో నిలిచారు. ఇదే గ్రామానికి చెందిన ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆరు పర్యాయాలు ఎమ్మెల్యేగా, ఒక సారి ఎంపీగా, ప్రస్తుతం రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, తాగు నీటి పారుదల శాఖ మంత్రిగా పని చేస్తున్నారు. ప్రస్తుతం బీఆర్ఎస్ పాలకుర్తి అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు.






పురుషోత్తమరావు బోయినపల్లి వినోద్‌కుమార్, కడియం శ్రీహరి ఎర్రబెల్లి దయాకర్‌రావు

# నల్ల నేలలో | నాలుగోసారి..




**భూపాలపల్లి నియోజకవర్గంలో గెలిచిన అభ్యర్థుల వివరాలు**

| సంవత్సరం | గెలిచిన పార్టీ | అభ్యర్థి | సమీప ప్రత్యర్థి | మెజార్టీ |
|---|---|---|---|---|
| 2009 | కాంగ్రెస్ | గండ్ర వెంకటరమణారెడ్డి | ఎస్. మధుసూదనాచారి(బీఆర్ఎస్) | 11,972 |
| 2014 | బీఆర్ఎస్ | ఎస్. మధుసూదనాచారి | గండ్ర వెంకటరమణారెడ్డి(కాంగ్రెస్) | 7,214 |
| 2018 | కాంగ్రెస్ | గండ్ర వెంకటరమణారెడ్డి | గండ్ర సత్యనారాయణరావు(ఏఐఎఫ్‌బీ) | 15,635 |

## 2009లో ఏర్పడిన భూపాలపల్లి అసెంబ్లీ నియోజకవర్గం

- మూడు సెగ్మెంట్ల మండలాలతో ఆవిర్భావం
- రెండుసార్లు కాంగ్రెస్, ఒకసారి బీఆర్ఎస్ విజయం
- ఇక్కడ యువత, పట్టణ ఓట్లే కీలకం

భూపాలపల్లి : సింగరేణి, కేటీపీపీలతో పరిశ్రమల ఖిల్లాగా పేరున్న భూపాలపల్లి నియోజకవర్గంలో నాలుగోసారి ఎన్నికలు జరగబోతున్నాయి. మూడు నియోజకవర్గాల్లోని పలు మండలాల కలయికతో ఏర్పడిన ఈ సెగ్మెంట్‌లో కాంగ్రెస్ రెండుసార్లు తన సత్తా చాటగా ఒకసారి బీఆర్ఎస్ జెండా ఎగురవేసింది. గ్రామీణ ప్రాంత ప్రజలతో పాటు వివిధ రాష్ట్రాలు, జిల్లాలకు చెందిన వారు ఉపాధి నిమిత్తం ఇక్కడ నివసిస్తుండగా పట్టణ, యువత ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉంది.

**ఆరు మండలాలతో ఏర్పాటు..**

నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా 2009లో ఆరు మండలాలతో కూడిన భూపాలపల్లి నియోజకవర్గం ఏర్పడింది. పరకాల నియోజకవర్గంలోని చిట్యాల, మొగుళ్లపల్లి, భూపాలపల్లి, ములుగు నియోజకవర్గంలోని గణపురం, రద్దయిన శాయంపేట నియోజకవర్గంలోని శాయంపేట మండలంతో ఈ నియోజకవర్గాన్ని ఏర్పాటు చేశారు. అలాగే, పరకాల నియోజకవర్గంలో మెజార్టీ భాగం ఉండి, శాయంపేట నియోజకవర్గంలో ఏడు గ్రామాలు మాత్రమే ఉన్న రేగొండ మండలాన్ని కూడా భూపాలపల్లి సెగ్మెంట్‌లో కలిపారు. కాగా, చిట్యాల మండలం నుంచి టేకుమట్ల, ఇటీవల రేగొండను విభజించి కొత్తపల్లి గోరి మండలం ఏర్పాటు చేయగా ప్రస్తుతం 8 మండలాలతో భూపాలపల్లి నియోజకవర్గం విస్తరించి ఉంది.

**రెండుసార్లు కాంగ్రెస్‌కే..**

ఇప్పటి వరకు మూడుసార్లు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రెండు దఫాలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డి గెలుపొందారు. ఈయన 2009లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రి పదవి ఆశించగా చీఫ్‌విప్ పదవి వరించింది. 2018లో హస్తం గుర్తు నుంచి గెలుపొందిన అనంతరం బీఆర్ఎస్‌లో చేరారు. 2014లో బీఆర్ఎస్ అభ్యర్థి సిరికొండ మధుసూదనాచారి గెలుపొంది తెలంగాణ రాష్ట్రానికి తొలి శాసన సభాపతిగా పని చేశారు.

**పెరుగుతున్న ఓటర్లు..**

సింగరేణి, కేటీపీపీ పరిశ్రమల కారణంగా వివిధ రాష్ట్రాలు, జిల్లాల నుంచి వేలాది మంది ఇక్కడి వచ్చి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందుతున్నారు. నియోజకవర్గ కేంద్రం దినదినాభివృద్ధి చెంది జిల్లాగా రూపుదిద్దుకోవడంతో ఓటర్ల సంఖ్య పెరుగుతూ వస్తోంది. 2009లో తొలిసారి జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 2,22,552 మంది ఓటర్లు ఉండగా ప్రస్తుతం 2,68,028 మంది ఉన్నారు. గడిచిన 14 ఏళ్లలో 45,476 మంది ఓటర్లు పెరిగారు.

**భూపాలపల్లే కీలకం..**

నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో అత్యధికంగా భూపాలపల్లి మండలంలో 75,015 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో ప్రధానంగా పట్టణ ఓటర్ల సంఖ్యే అధికంగా ఉంటుంది. పట్టణంలో 5,600 మంది సింగరేణి ఉద్యోగులు ఉండగా, వారి కుటుంబ సభ్యులతో కలిసి సుమారు 20వేల ఓట్ల వరకు ఉంటాయి. అలాగే, నియోజకవర్గ మొత్తం 1,26,887 మంది యువ ఓటర్లు ఉన్నారు. పట్టణ, యువ ఓటర్లే ఈ ఎన్నికల్లో కీలకమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.



# ప్రజల ఆకాంక్ష నెరవేర్చాలి



'సాక్షి' 'పీపుల్స్ ఎజెండా'లో పాల్గొన్న కాళోజీ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

## ఉపాధి కోసం పరిశ్రమలు ఏర్పాటు చేయాలి

- ప్రతి పల్లెను అభివృద్ధి చేయాలి
- 'సాక్షి' 'పీపుల్స్ ఎజెండా'లో కాళోజీ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, పట్టణ ప్రజల స్పష్టీకరణ

సాక్షి 'పీపుల్స్ ఎజెండా'

'తెలంగాణ ఆవిర్భవించి పది సంవత్సరాలు గడుస్తున్నా గిరిజన జిల్లా మానుకోట అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. విద్య, ఉపాధి, ఉక్కు పరిశ్రమలు ఏర్పాటు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం చెందాయని' మానుకోట కాళోజీ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, పలువురు పట్టణ ప్రజలు పేర్కొన్నారు. ఎన్నికల సమయంలోనే నాయకులకు ప్రజలు గుర్తుంటారు. తర్వాత ప్రజా సమస్యలను గాలికొదిలేస్తారని మండిపడ్డారు. తెలంగాణ శాసన సభ ఎన్నికల నేపథ్యంలో బుధవారం 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన 'పీపుల్స్ ఎజెండా'లో వారు తమ డిమాండ్లను రాబోయే ప్రభుత్వాల ముందుంచారు. 'వచ్చే ప్రభుత్వాలు ప్రజల ఆకాంక్షలు నెరవేర్చాలి. ఉపాధి కోసం జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటు చేసి ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నిలపాలని' కోరారు. - మహబూబాబాద్ అర్బన్

### సేవా గుణం ఉండాలి



రాజకీయాల్లో సేవాగుణం ఉండాలి. ప్రజలకు మంచి చేయాలనే ఆలోచన ఉండాలి. అప్పుడే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుంది. అభ్యర్థుల గుణగణాలు పరిశీలించి ప్రజలు ఓటు వేయాలి. మానుకోట అభివృద్ధి కోసం నిజాయితీగా ఓట్లు వేసి మంచి నాయకుడిని ఎన్నుకుంటాం.

- దోలి సత్యనారాయణ, మానుకోట

### సెక్యులర్ నాయకులే పోటీ చేయాలి



కుల, మతాలకతీతంగా ఉండే నాయకులే ఈ ఎన్నికల్లో పోటీ చేయాలి. మానుకోటలో గిరిజన యూనివర్సిటీ, బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని పోరాడాం. అవి నేటికీ మంజురు కాలేదు. విద్యాభివృద్ధికి తోడ్పడే నాయకుడినే మానుకోటలో గెలిపిస్తాం.

- రవీందర్, ప్రభుత్వ అధ్యాపకుడు, మానుకోట

### అభివృద్ధి మర్చిపోతున్నారు



ఎన్నికల్లో గెలుపొందిన తర్వాత ప్రజాప్రతినిధులు పార్టీలు మారుతూ ప్రజా సమస్యలను గాలికొదిలేస్తున్నారు. అందుకే ఈ ఎన్నికల్లో ప్రజా సమస్యలు పరిష్కరించే నాయకులనే ఎన్నుకుంటాం..

- వెంకట్‌రెడ్డి, కాళోజీ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, మానుకోట

### పల్లెల్లో అభివృద్ధి జరగాలి



గ్రామాలు అభివృద్ధి సాధించినప్పుడే నిజమైన దేశ ప్రగతి. 2016లో మానుకోట జిల్లాగా ఆవిర్భవించింది. రూ. కోట్లు వృథా చేశారే తప్ప జిల్లాలో ఎక్కడా అభివృద్ధి జరగలేదు. అందుకే అభివృద్ధికి కృషి చేసే నాయకుడినే ప్రజలు ఈ ఎన్నికల్లో గెలిపించాలి.

- మైస శ్రీనివాసులు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు, మానుకోట

### ప్రజల గురించి ఆలోచించాలి



ఎన్నికల్లో గెలిచిన తర్వాత ప్రజాప్రతినిధులు వారి ఆస్తులు పెంచుకుంటున్నారు. సంక్షేమ పథకాలు కూడా వారి నాయకులకే అందిస్తున్నారు. మానుకోటలో స్టేడియం అభివృద్ధి చేయాలి. అలాగే, గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలి. ప్రజల గురించి ఆలోచించే నాయకుడే మాకు కావాలి.

- లక్ష్మయ్య, కాళోజీ వాకర్స్ అసోసియేషన్ కోశాధికారి

### ఎన్నికల ఖర్చు ఎక్కువ



ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా భారత దేశంలోనే ఖర్చు అవుతుంది. ఖర్చు పెట్టిన డబ్బు సంపాదించుకోవడానికే నాయకులు ఆరాటపడుతున్నారు తప్ప ప్రజా సమస్యలు, అభివృద్ధి గురించి ఆలోచించడం లేదు. అందుకే మానుకోట ప్రజలు మంచి నాయకుడికే పట్టం కట్టాలి.

- సోమన్న, కాళోజీ వాకర్స్ అసోసియేషన్ సభ్యుడు

### మేనిఫెస్టో అమలు చేయాలి



మానుకోట జిల్లా అభివృద్ధిలో పూర్తిగా వెనకబడింది. గ్రామీణ, పట్టణ ప్రజలు సంక్షేమం, అభివృద్ధిని కోరుకుంటున్నారు. నాయకులు గెలిచిన తరువాత తమ పార్టీ మేనిఫెస్టోను అమలు చేయాలి. మానుకోటలో పాలిటెక్నిక్ కళాశాల, సైనిక్, నవోదయ పాఠశాలలు ఏర్పాటు చేయాలి.

- విష్ణువర్ధన్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు, మానుకోట

### ఉచితాలు వద్దు



ప్రభుత్వాలు ప్రజలకు మార్గదర్శంగా ఉండాలి. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి. కానీ ఉచిత పథకాల పేరుతో ప్రజలను రోజురోజుకూ సోమరులుగా చేస్తున్నాయి. ఇది సరికాదు. యువతకు ఉపాధి కల్పించడానికి పారిశ్రామిక కేంద్రాలు ఏర్పాటు చేయాలి. బాలికల, మహిళలకు రక్షణ కల్పించాలి.

- కె. శ్రీనివాస్, కాళోజీ వాకర్స్ అసోసియేషన్ సభ్యుడు

### ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలి



మానుకోట జిల్లా కేంద్రంలో రోజురోజుకూ ట్రాఫిక్ పెరుగుతోంది. ఇష్టానుసారంగా వాహనాలు నడపడంతో పట్టణం పద్మవ్యూహం అవుతోంది. ట్రాఫిక్‌పై అవగాహన కల్పించడంలో పోలీసులు, ప్రజాప్రతినిధులు విఫలం చెందారు. వచ్చే ప్రభుత్వాలు మానుకోటలో ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలి.

- పరమేశ్వర్, వ్యాపారి, మానుకోట

### ఉపాధి అవకాశాలు కల్పించాలి



జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటు చేసి ఈ ప్రాంత ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించాలి. ఈ రోజుల్లో రాజకీయాలు ఆర్థిక సంబంధంతో ముడిపడి ఉన్నాయి. నిజాయితీగా ఓటు వేసి మంచి నాయకులను ఎన్నుకుంటాం.

- తిప్పర్తి శ్రీధర్, నిరుద్యోగి, మానుకోట



20వ వార్డులో దోశవేస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా

## దోశ కాల్చి.. ఓటు అభ్యర్థించి..

బీఆర్ఎస్ జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి బుధవారం పట్టణంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓ హోటల్‌లో దోశలు వేసి.. తనకు ఓటు వేసి గెలిపించాలని యజమానిని అభ్యర్థించారు.

- జనగామ

## అభ్యర్థులు క్యూ'లైన్' పాటించాలి..

అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం రేపటి నుంచి (శుక్రవారం) ప్రారంభం కానుంది. దీంతో అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ఈ నేపథ్యంలో బుధవారం పరకాల ఆర్డీఓ (రిటర్నింగ్ అధికారి) కార్యాలయానికి 100 మీటర్ల దూరంలో జాయింట్ కలెక్టర్ మహేందర్‌జీ పర్యవేక్షణలో లైన్ (గీత) ఏర్పాటు చేశారు. కాగా, అభ్యర్థులు ఈ లైన్‌లోనే నిలబడి నామినేషన్ దాఖలు చేయడానికి లోపలికి వెళ్లాల్సి ఉంటుంది.

- పరకాల



ఆర్డీఓ కార్యాలయం వద్ద లైన్ వేస్తున్న అధికారులు



## నీటితొట్టిలో పడి బాలుడి మృతి



వేదాంత్ మృతదేహం

గూడూరు: నీటితొట్టిలో పడి ఓ బాలుడు మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం గూడూరు శివారు కలకత్తా తండాలో జరిగింది. తండాకు చెందిన వాంకుడోతు సురేష్, స్నేహ దంపతుల కుమారుడు వేదాంత్ (2) ఇంటి ముందు ఆడుకుంటున్నాడు. ఈ సమయంలో తల్లి స్నేహ ఇంట్లో పని చేస్తోంది. ఈ క్రమంలో ఆడుకుంటున్న వేదాంత్ నీటితొట్టి వైపు వెళ్లి అందులో పడ్డాడు. కొద్ది సమయం తరువాత బయటకు వచ్చిన తల్లికి కుమారుడు కనిపించలేదు. దీంతో అనుమానం వచ్చి నీటితొట్టిలో చూడగా అందులో పడి ఉన్నాడు. దీంతో వెంటనే బాలుడిని బయటకు తీసి గూడూరు సీహెచ్‌సీకి తరలించారు. అప్పటికే బాలుడు మృతి చెందాడని వైద్యుడు నిర్ధారించారు. కాగా, కుటుంబీకులు కుమారుడి మృతదేహంపై పడి రోదించిన తీరు ప్రతీ ఒక్కరిని కదిలించింది.

**విద్యుదాఘాతంతో రైతు ..**



శంకర్‌రావు(ఫైల్)

గంగారం : విద్యుదాఘాతంతో ఓ రైతు మృతి చెందారు. ఈ ఘటన మండలంలోని కామారంలో జరిగింది. గ్రామానికి చెందిన రైతు పెనక శంకర్‌రావు (54) మంగళవారం రాత్రి నీరు పారించడానికి తన పొలానికి వెళ్లాడు. బుధవారం ఉదయం ఇంటికి రాకపోవడంతో అనుమానం వచ్చి కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్లారు. అక్కడ చూడగా విద్యుత్ షాక్ గురై మృతి చెంది కనిపించాడు. ఈ ఘటనపై కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దిలీప్ తెలిపారు.

**రోడ్డు ప్రమాదంలో యువకుడు..**

పాలకుర్తి: మండలంలోని తిర్మలగిరి గ్రామానికి చెందిన బక్క రాజు(23) మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. రాజు, అనూష దంపతులకు ఇటీవల కుమారుడు జన్మించాడు. దీంతో అనూష తన తల్లిగారి ఊరు దర్దేపల్లిలో ఉంటుంది. ఈ క్రమంలో రాజు మంగళవారం భార్యను చూసేందుకు దర్దేపల్లికి వెళ్లాడు. రాత్రి బైక్‌పై స్వగ్రామానికి వస్తుండగా మార్గమధ్యలో జంతువులు అడ్డు రావడంతో కిందపడ్డాడు. అటుగా వెళ్తున్న వాహనదారులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు ఘటనా స్థలికి చేరుకుని తీవ్రంగా గాయపడిన రాజును చికిత్స నిమిత్తం జనగామ ఆస్పత్రికి తరలించగా అతను అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ ఘటనపై మృతుడి భార్య అనూష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

## రుద్రేశ్వరస్వామి ఇష్టమైన దైవం

- వరంగల్ సీపీ అంబర్‌కిశోర్ ఝా



దేవాలయంలో సీపీ దంపతులు

హన్మకొండ కల్చరల్ : రుద్రేశ్వరస్వామి తనకు ఇష్టమైన దైవమని, గతంలో వేయిస్తంభాల దేవాలయాన్ని పలుమార్లు సందర్శించానని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్‌కిశోర్ ఝా పేర్కొన్నారు. సీపీగా పదవీబాధ్యతలు స్వీకరించిన అనంతరం బుధవారం మొదటిసారి హనుమకొండలోని చారిత్రక శ్రీరుద్రేశ్వరస్వామి వారి వేయిస్తంభాల దేవాలయాన్ని ఆయన కుటుంబసమేతంగా సందర్శించారు. ఆలయ ఈఓ వెంకటయ్య, ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ.. సీపీ దంపతులకు ఆలయమర్యాదలతో స్వాగతం పలికారు. పూజలు నిర్వహించిన అనంతరం అర్చకులు అంబర్‌కిశోర్ ఝా దంపతులకు తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు, మహాదాశీర్వచనం అందజేశారు.

**సంకటహర చతుర్థి పూజలు**

బుధవారం దేవాలయంలో సంకటహరచతుర్థి పూజలు ఘనంగా జరిగాయి. గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో అర్చకులు ఉదయం నుంచి ప్రభాత పూజలు, శ్రీరుద్రేశ్వరస్వామికి రుద్రాభిషేకం నిర్వహించారు. దేవాలయంలోని కాకతీయుల కాలం నాటి ఉత్తిష్టగణపతికి నవరసాభిషేకం, పంచామృతాభిషేకం, గరికపూజ నిర్వహించారు. మహాహారతి మంత్రపుష్పం జరిపి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

# బీఆర్ఎస్, ఎంఐఎం ఒక్కటే..

- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి రియాజ్



మాట్లాడుతున్న రియాజ్

హన్మకొండ : బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలు ఆస్తుల సంరక్షణకు లోపాయికారీ ఒప్పందం చేసుకున్నాయని టీపీసీసీ అధికార ప్రతినిధి రియాజ్ తెలిపారు. ఈ మేరకు బుధవారం హనుమకొండ సర్క్యూట్ హౌజ్ రోడ్డులోని విశాల్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఏర్పాటు చేయొద్దని ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ పార్లమెంట్‌లో మాట్లాడారని, వీరితో బీఆర్ఎస్ ఎలా పొత్తు పెట్టుకుంటుందని ప్రశ్నించారు. ఉద్యమకారులు, బీఆర్ఎస్‌ను నమ్ముకున్న వారు దిక్కుతోచని స్థితిలో ఉంటే ఉద్యమాన్ని వ్యతిరేకించిన పార్టీతో ఎలా మైత్రి కొనసాగిస్తారని నిలదీశారు. మైనారిటీలకు వ్యతిరేకంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చట్టాలు తీసుకువస్తే బీఆర్ఎస్ మద్దతు ఇచ్చిందన్నారు. ఎంఐఎం, బీఆర్ఎస్ పార్టీల పొత్తు బహిరంగమైతే బీజేపీతో రహస్య పొత్తు అన్నారు. ఎంఐఎం, బీఆర్ఎస్‌కు ఓటు వేస్తే బీజేపీకి ఓటు వేసినట్లేనన్నారు. మైనారిటీల సంక్షేమం, దేశ సమగ్రత కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. అన్ని వర్గాల మైనారిటీల సంక్షేమానికి ప్రాధాన్యం ఇచ్చే కాంగ్రెస్‌కు అండగా నిలువాలన్నారు. కాంగ్రెస్ జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు అజీజుల్లా బేగ్, అంకూష్, అజార్ హుస్సేన్, నబీద్, సమద్, తదితరులు పాల్గొన్నారు.

# యాజమాన్య పద్ధతులు పాటించాలి



మిరప పంటను పరిశీలిస్తున్న కేవీకే శాస్త్రవేత్త

మామునూరు: మిరప పంటపై నల్ల తామర పురుగును తొలిదశలోనే గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని , ప్రతి రైతు సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలని మామునూరు కేవీకే శాస్త్రవేత్తల బృందం ప్రోగ్రాం కోఆర్డినేటర్ రాజన్న సూచించారు. ఖిలా వరంగల్ మండలం బొల్లికుంట గ్రామంలో బుధవారం కృషి విజ్ఞాన కేంద్రం మామునూరు శాస్త్రవేత్తల బృందం ఆధ్వర్యంలో వివిధ పంటలను సందర్శించారు. మిరప పంటను పరిశీలించి నల్ల తామర పురుగుల ఉధృతిని గుర్తించారు. ఈసందర్భంగా రాజన్న మాట్లాడారు. మిరప పంటపై నల్ల తామర పురుగుల ఉధృతి ఉంటే ఆందోళన చెందకుండా ఎకరానికి 30- 40 నీలి రంగు జిగురు అట్టలు అమర్చాలని, వేప నూనె 10,000 పీ.పీ.ఎం 1 మిల్లీలీటరు, బవేరియా బసియన అనే జీవ శిలీంద్రాన్ని, నిసిల్లియం జీవ శిలీంద్రాన్ని లీటర్ నీటికి 5గ్రాములు కలిపి పిచికారీ చేయాలని సూచించారు. అనంతరం శాస్త్రవేత్తలు గొర్రెలు, మేకల మందను సందర్శించారు. అప్పుడే పుట్టిన జీవాల్లో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులు వివరించారు. గొర్రె పిల్లల కోసం ఖనిజ లవణాల ఇటుకలను పాకలో అమర్చాలని సూచించారు. జీవాల్లో సీజనల్ వ్యాధులు, కాలిగిట్టల మధ్యలో పుండ్లను గుర్తించి పొటాషియం పర్మాంగనేట్ ద్రవంతో పదిరోజులు గిట్టలను శుభ్రం చేయాలని, యాంటీబయాటిక్ మందులు వాడాలని శాస్త్రవేత్తలు సూచించారు.